సాక్షి
అన్నమయ్య జిల్లా

శనివారం | 24 | మే | 2025



రాజంపేటలో..తమ్ముళ్ల రాద్ధాంతం

రాజంపేటలో టీడీపీ ఇన్‌ఛార్జి నియామకం ఎటూ తేలలేదు.తాత్కాలిక ఇన్‌చార్జిగా చమర్తి జగన్ మోహన్‌రాజు ఉంటారని ప్రకటన వెలువడటంతో ప్రత్యర్థి వర్గీయులు రగలిపోయారు. -10లో




క్వారీకి ఎలా అనుమతిస్తారు?

డేంజర్ జోన్‌గా ప్రకటించినా ఏపీఎండీసీ మంగంపేట గనికి 500 మీటర్ల దూరంలో కంకర క్వారీకి ఎలా అనుమతిస్తారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. -10లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.90	రూ.114
రెండోరకం	రూ.60	రూ.80

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 1162 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

'జాతీయ గ్రామ ఉత్కర్ష అభయాన్' పక్కాగా అమలవ్వాలి

రాయచోటి: జిల్లాలో గిరిజనులకు దర్తిఅభజన జాతీయ గ్రామ ఉత్కర్ష అభయాన్-2025 పథకం పక్కాగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి మండల అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహాయంతో నిర్వహించే ఈ కార్యక్రమంపై గిరిజనులకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో జేసీ ఆదర్శ్ రాజేంద్రన్, గిరిజన సంక్షేమశాఖ అధికారి తేజస్విని పాల్గొన్నారు.

సకాలంలో సరుకులు అందించాలి

లక్కిరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని పౌరసరఫరాల గోదామును శుక్రవారం జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి రఘురాం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చౌక దుకాణాలకు సరుకులను సకాలంలో చేరవేయాలని గోదాం ఇన్‌చార్జి మల్లికార్జున బాబుకు సూచించారు. గోదాములోని నిత్యావసర వస్తువుల నిల్వలను పరిశీలించారు. అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డీటీ శివప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

వెలిగల్లు రిజర్వాయర్‌కు సిబ్బంది కొరత

గాలివీడు: గాలివీడు మండలంలోని వైఎస్సార్ వెలిగల్లు రిజర్వాయర్ కు సిబ్బంది కొరత ఏర్పడింది. 4.64 టీఎంసీ నీటి నిల్వ సామర్థ్యం కలిగిన రిజర్వాయర్‌కు కుడి, ఎడమ కాలువల ద్వారా సుమారు 25 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. దీనికి నిర్వహణ సిబ్బంది లేక ఆయకట్టుదారులు ఇబ్బంది పడుతున్నారు. 16 మంది జేఈలుగా ఉండగా ఒకరు విధులు నిర్వహిస్తుండడం గమనార్హం. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ వైఎస్సార్ వెలిగల్లు రిజర్వాయర్ కు తగిన సిబ్బందిని ఏర్పాటు చేయాలని గాలివీడు మండల ప్రజలు, ఆయకట్టుదారులు కోరుతున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



వ్యాధిగ్రస్తులకు కిట్లు పంపిణీ చేస్తున్న వైద్యాధికారి రామచంద్రారెడ్డి

పుల్లంపేట: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పుల్లంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. డాక్టర్ మనోజ్ చంద్ర ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమావేశం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 274 ఫైలేరియా కేసులు నమోదయ్యాయన్నారు. ఫైలేరియా వ్యాధి దోమల ద్వారా వ్యాపిస్తుంది, కాబట్టి దోమల నుంచి దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం ఇద్దరు వ్యాధిగ్రస్తులకు కిట్లు పంపిణీ చేశారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ రాజ, సూపర్ వైజర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.


ఇటు కరోనా.. అటు మహానాడు

- కోవిడ్‌పై ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలంటూ ప్రభుత్వం హెచ్చరికలు
- మహానాడు భారీగా నిర్వహించేందుకు టీడీపీ కసరత్తు
- వేల మంది ప్రతినిధులతో సమావేశం, 5 లక్షల మందితో బహిరంగ సభ
- రిమ్స్‌లో కరోనా కేసు, అంతలోనే కాదు కాదంటూ బుకాయింపు
- మహానాడు వల్ల విస్తృత వ్యాప్తికి అవకాశం
- జిల్లాలో పెరగనున్న పాజిటివ్ కేసులు



కడపలో ఏర్పాటు చేస్తున్న మహానాడు ప్రాంగణం

సాక్షి ప్రతినిధి, కడప: కోవిడ్ మహమ్మారి అంటేనే.. పౌరసమాజం గజగజ వణికిపోతుంది. హోదాలు, బలగం, బంధుగణం, ఆర్థిక స్థితి, పలుకుబడి ఇవేవి కాపాడలేని అనుభవాలు.. ఇప్పటికీ వెంటాడుతూనే ఉన్నాయి. కళ్ల ముందు తల్లిదండ్రులు, అన్నదమ్ముళ్లు, ఆలుబిడ్డలు, ఆత్మీయులను కోల్పోయిన దుస్థితి. ఒక్కమాటలో చెప్పాలంటే.. మనుషుల ప్రాణాలు తీయడంతోపాటు జీవితాలను అతలాకుతలం చేసింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసింది. అలాంటి కోవిడ్‌ను మూడు విడతల్లో చూశాం. తాజాగా నాలుగో విడత ప్రబలనుంది. ఇప్పటికే సభలు, సమావేశాలు నిర్వహించరాదని.. ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్ర డైరెక్టర్ బుధవారం హెచ్చరించారు. ఈ నేపథ్యంలో మహానాడు నిర్వహణతో కరోనా మరింత ప్రబలే అవకాశం ఉందని వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో పాజిటివ్ కేసులు గణనీయంగా నమోదు కానున్నాయనే భయం ప్రజానీకానికి పట్టుకుంది.



వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ సూచనలు

ప్రార్థన మందిరాల సమావేశాలు, సామాజిక సమావేశాలు రాజకీయ పార్టీల సమావేశాలు, ఇతర కార్యక్రమాల వంటివి వాయిదా వేసుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్ర డైరెక్టర్ కోరారు. రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, విమానాశ్రయాలు వంటి వాటిలో కోవిడ్ నిబంధనలు పాటించాలని సూచించారు. ఎక్కువ జనాభా ఉన్న ప్రదేశాల్లో మాస్కులు తప్పనిసరిగా వాడాలని పేర్కొన్నారు. జ్వరం, చలి, దగ్గు, అలసట, గొంతునొప్పి, రుచి లేదా వాసన కోల్పోవడం, తలనొప్పి, కండరాలు లేదా శరీర నొప్పులు, ముక్కు కారడం లేదా ముక్కుదిబ్బడ, వికారం, వాంతులు, విరోచనాలు ఉంటే దగ్గరలోని ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని స్పష్టం చేశారు. అన్ని పరీక్షల సౌకర్యాలతో కూడిన 24 గంటలు పని చేసే ల్యాబ్‌లలో మాస్కులు, పీపీఈ కిట్ ట్రిబుల్ లేయర్ మాస్కులను తగిన పరిణామంలో ఉంచుకోవాలని అధికారులకు వైద్య ఆరోగ్యశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఇలాంటి పరిస్థితి ఓవైపు ఉంటే.. మరోవైపు మహానాడు ఏర్పాట్లలో ప్రభుత్వ పెద్దలు, తెలుగు తమ్ముళ్లు నిమగ్నమైపోయారు.



మూడు రోజులు మహానాడు

తెలుగుదేశం పార్టీ ప్రతినిధులు దేశ, విదేశాల నుంచి మహానాడుకు హాజరు కానున్నారు. ఈ నెల 27, 28, 29వ తేదీల్లో మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. మహానాడులో తొలి, మలిరోజు 23 వేల మంది ప్రతినిధులతో వివిధ అంశాలపై సమీక్ష చేపట్టనున్నారు. చివరి రోజు 5 లక్షల మందితో బహిరంగ సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు టీడీపీ నేతలు ప్రకటించారు. కోవిడ్ వ్యాప్తి గురించి ముందస్తు చర్యలు, జాగ్రత్తలు తీసుకోవాలని ఓవైపు ప్రభుత్వమే దిశానిర్దేశం చేసింది. మరోవైపు అందులో కీలక భాగస్వామి అయిన తెలుగుదేశం పార్టీ.. అలాంటి నిబంధనలు ఏమీ పాటించకుండా మహానాడు నిర్వహించేందుకు వేగంగా సన్నహాలు చేస్తోంది.

కడపలో డేంజర్ బెల్స్..

నంద్యాల జిల్లా చాగలమర్రికి చెందిన షేక్‌చాంద్ బీబీ(75) అనే వృద్ధురాలు అనారోగ్యంతో కడప రిమ్స్‌లో అడ్మిట్ అయింది. కోవిడ్ టెస్ట్ చేసిన వైద్యులు పాజిటివ్‌గా నిర్ధారించి ప్రత్యేక చికిత్సలు అందిస్తున్నారు. సోషల్ మీడియాలో ఈ విషయం వైరల్ అయింది. వెంటనే తేరుకున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ నాగరాజు కోవిడ్ కేసు నమోదు కాలేదని, అదంతా ఉత్తుత్తి ప్రచారమంటూ కొట్టిపారేశారు. అదే వాస్తవం అయితే కోవిడ్ టెస్ట్ రిపోర్టు బహిర్గత పర్చాలి కదా? కోవిడ్ పాజిటివ్ కేసులు దాచి పెట్టడం ఏ మేరకు సబబు? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఓవైపు రిమ్స్ పాలనావిభాగం ప్రత్యేక చికిత్సలు అందిస్తుంటే.. మరోవైపు వైద్య ఆరోగ్యశాఖ జిల్లా బాధ్యుడు కొట్టిపారేయడం వెనుక మహానాడు జిల్లాలో నిర్వహించ తలపెట్టడమేనని పలువురు వివరిస్తున్నారు. ఇప్పటికే విశాఖపట్నంలో ఓ కేసు నమోదు అయినట్లు అధికారికంగా ప్రకటించారు. కడపలో నమోదు అయిన కేసును తొక్కి పెట్టారని పలువురు వాపోతున్నారు. దేశ, విదేశాల నుంచి వచ్చే తెలుగుతమ్ముళ్లకు కోవిడ్ ఉంటే.. విస్తృతంగా ఇటు జిల్లాలో, అటు రాష్ట్ర వ్యాప్తంగా వ్యాప్తి చెందే అవకాశం లేకపోలేదని పలువురు వైద్యులు చెబుతున్నారు. కోవిడ్ వ్యాప్తి తర్వాత అప్రమత్తం కావడం కంటే, దాని బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్న వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ మార్గదర్శకాలు టీడీపీ మహానాడుకు మినహాయింపా అనే ప్రశ్న ఉదయిస్తోంది. నిజాయితీగా కోవిడ్ వ్యాప్తి కాకుండా చర్యలు చేపట్టాలంటే.. ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు మహానాడు నిర్వహణపై సరైన నిర్ణయం తీసుకోవాలని ప్రజాస్వామ్యవాదులు పేర్కొంటున్నారు.

అన్నమయ్య జిల్లాలోకి మరో ఆరు మండలాలు బదిలీ

- జిల్లా కలెక్టర్‌చే గెజిట్ నోటిఫికేషన్



రాయచోటి: ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి చిత్తూరు జిల్లాలోని పుంగనూరు నియోజకవర్గ పరిధిలో ఆరు మండలాలను అన్నమయ్య జిల్లాకు బదిలీ చేస్తూ ప్రాథమికంగా జిల్లా గెజిట్ రాజపత్రాన్ని జారీ చేశారు. ఈ మేరకు గెజిట్ రాజపత్రాన్ని శుక్రవారం పత్రికలకు విడుదల చేసిన ఒక ప్రకటనలో జిల్లా కలెక్టర్ తెలిపారు. ఏపీ ప్రభుత్వం జీఓ ఆర్టీ నెంబరు. 463, ఈనెల 22వ తేది చిత్తూరు జిల్లా నుండి ఆరు మండలాలను అన్నమయ్య జిల్లాకు బదిలీ చేస్తూ ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ జిల్లాల ఏర్పాటు చట్టం 1974 (7)వ) చట్టంలోని సెక్షన్ 3లోని ఆరవ ఉప విభాగం క్రింద సంబంధిత ప్రాంతాల మెరుగైన పరిపాలన, అభివృద్ధి దృష్ట్యా చిత్తూరు జిల్లాలోని పలమనేరు రెవెన్యూ డివిడన్ నుండి పుంగనూరు, చౌడేపల్లి, సోమల, సదుం మండలాలను మరియు అదే జిల్లాలోని చిత్తూరు రెవెన్యూ డివిజన్ నుండి రొంపిచర్ల, పులిచెర్ల మండలాలను అన్నమయ్య జిల్లా పరిధిలో ఉన్న మదనపల్లి రెవెన్యూ డివిజన్‌కు బదిలీ చేయాలని ప్రభుత్వం ప్రతిపాదిస్తున్నట్లు ప్రకటించారు. పై ప్రతిపాదన వలన ప్రభావితమగు జిల్లాలో నివసించే వ్యక్తులు అభ్యంతరాలు, సూచనలను ఇంగ్లీషు లేదా తెలుగులో లిఖిత పూర్వకంగా అన్నమయ్య జిల్లా కలెక్టర్, చిత్తూరు జిల్లా కలెక్టర్ కార్యాలయాలకు గెజిట్ నోటిఫికేషన్ ప్రచురించిన తేది నుంచి ముప్పై రోజుల గడువు ముగిసేలోపు లేదా అంతకముందే చేరేలా పంపాల్సి ఉంటుందని సదరు గెజిట్‌లో కలెక్టర్ పేర్కొన్నారు.

ఎన్నికల ప్రక్రియ పటిష్టానికి సూచనలు అందించండి

- రాజకీయ పార్టీ నేతలతో కలెక్టర్ ఛామకూరి శ్రీధర్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్

రాయచోటి : జిల్లాలో ఎన్నికల ప్రక్రియను పటిష్టం చేయడానికి రాజకీయ పార్టీల అభిప్రాయాలు, సూచనలు ఎంతో కీలకమని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో అన్నమయ్య జిల్లాలో ఓటర్ల సవరణ-2025 పోలింగ్ కేంద్రాల మార్పులు, చేర్పులు తదితర అంశాలపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో డీఆర్‌ఓ మధుసూదనరావు గత సమావేశంలో చర్చించిన వివిధ విషయాలు, ప్రస్తుత సమావేశానికి సంబంధించిన అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు క్లుప్తంగా వివరించారు. 18 సంవత్సరాలు నిండిన ఓటర్లను నమోదు చేయడంలో రాజకీయ పార్టీలు కూడా భాగస్వాములు కావాలన్నారు. ప్రతి పార్టీ బూత్ లెవల్ అసిస్టెంట్లను నియమించుకొని జాబితాను సమర్పించాలని కోరారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీ ప్రతినిధులు వెలిబుచ్చిన సందేహాలను కలెక్టర్ నివృత్తి చేశారు.

విధులలో నిర్లక్ష్యం వహించిన ఇద్దరు పంచాయతీ సెక్రటరీలపై చర్యలకు ఆదేశం

లక్కిరెడ్డిపల్లి: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రతి ఇంటికి వెళ్లి తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించాలని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ ఎంపీడీఓ, డీఎల్‌పీఓ, పంచాయతీ సెక్రటరీలను ఆదేశించారు. శుక్రవారం లక్కిరెడ్డిపల్లి మండంలో పర్యటించారు. ఈ సందర్భంగా అనంతపురం పంచాయతీలోని చెత్తనుంచి సంపద సృష్టి తయారీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సేకరించిన చెత్తను ఎక్కడ డంప్ చేశారు అని కలెక్టర్ ప్రశ్నించగా పంచాయతీ సెక్రటరీలు సరిగా సమాధానాలు ఇవ్వలేకపోయారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించడమే కాకుండా ఉన్నతాధికారుల ఆదేశాలు పాటించకపోవడంతో అనంతపురం గ్రామ పంచాయతీ సెక్రటరీ ఎం మధుసూదన, మద్దిరేవుల గ్రామ పంచాయతీ సెక్రటరీ ఎంఎస్ రజనీష్ రెడ్డిలను సస్పెండ్ చేయాలని అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. పంచాయతీ సెక్రటరీలు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే షోకాజ్ నోటీలు జారీ చేయాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓకు సూచించారు. అనంతరం మండలంలో ప్రభుత్వ పథకాల అమలుపై ఆయాశాఖల అధికారులతో సమీక్షించారు. వ్యవసాయ, ఉద్యాన పంటలపై సమీక్షిస్తూ మండలంలో ఎంతమంది రైతులకు నూతన, రెన్యూవల్ సీసీఆర్‌సీ కార్డులు జారీ చేశారు, ఇంకనూ ఎంతమందికి జారీ చేయాల్సి ఉంది అని అడిగి తెలుసుకున్నారు. గృహ నిర్మాణశాఖ సమీక్షలో భాగంగా గత వారం రోజుల ప్రగతిని సమీక్షించారు. మండలంలో ఎక్కడా తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో హౌసింగ్ పీడీ శివయ్య, డీఎస్‌ఓ రఘురాం, ఇన్‌చార్జి ఎంపీడీఓ ఉషారాణి, తహసీల్దార్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

రగులుతున్న తమ్ముళ్లు!

- మూడు మార్కెట్ కమిటీల పెండింగ్‌పై ఆగ్రహం



మదనపల్లె వ్యవసాయ మార్కెట్

మదనపల్లె: రాష్ట్రమంతా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పోస్టులను భర్తీ చేస్తుంటే..తమవంతు ఎప్పుడని మదనపల్లె, తంబళ్లపల్లె తెలుగుదేశం పార్టీ తమ్ముళ్లు ఎదురు చూస్తున్నారు.మరోవైపు పోస్టులు భర్తీ కాకపోవడానికి స్థానిక నేతల తీరే కారణమంటూ ఇటు సీనియర్లు, అటు కష్టపడి పనిచేసిన నాయకులు రగిలిపోతున్నారు.పార్టీ కోసం కష్టపడిన నాయకులను విస్మరించి తమ వర్గీయులకు మాత్రమే పదవులు కట్టబెట్టేలా మదనపల్లె, తంబళ్లపల్లె టీడీపీ ముఖ్యులు చేసిన ప్రయత్నాల వల్లే నామినేటెడ్ పోస్టులను పెండింగ్‌లో పెట్టారని మండిపడుతున్నారు.

పనిచేయని వారికి సిఫార్సు

మదనపల్లె మార్కెట్ కమిటీ చైర్మన్ కోసం సిఫార్సు చేసిన పేర్లలో సీనియర్లను గుర్తించకపోగా, పార్టీ కోసం పని చేయని వారి పేర్లను సిఫార్సు చేసినట్టు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. పదిమందికి పైగా పేర్లను సిఫార్సు చేస్తే అందులో ఒకరు కూడా పార్టీ సూచించిన క్లస్టర్, యూనిట్, బూత్ కమిటీల్లో లేరని, అలాగే కీలకమైన కుటుంబ సాధికార సారధుల జాబితాలో లేరని చెబుతున్నారు. ఎమ్మెల్యేకు అనుకూలమైన వ్యక్తులు కావడం లేదా వారికి పదవులు దక్కే అవకాశం లేదని తెలిసి సిఫార్సు చేసి ఉంటారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పార్టీ విధివిధానాల ప్రకారం సిఫార్సు చేయకపోవడం వల్లే కమిటీ నియామకం జరగలేదని స్పష్టమవుతోంది. అలాగే ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పార్టీలోని మిగిలిన వర్గాలను పక్కన పెట్టడం కూడా ఒక కారణం. వ్యతిరేక వర్గానికి ప్రాధాన్యత ఇవ్వకపోవడం వల్ల అన్ని వర్గాల మధ్య ఏకాభిప్రాయం కోసం పెండింగ్ పెట్టారని చెబుతున్నారు. ఎమ్మెల్యేకు అనుకూలమైన వారికే ప్రాధాన్యత దక్కుతోందని పార్టీ సీనియర్లు బాహాటంగా చెబుతున్నారు. ఇటీవల జరిగిన కొన్ని ఎన్నికలు, వాటికి ఎంపికైన నాయకులే నిదర్శనమని చెబుతున్నారు.

చెప్పుకుందామంటే మంత్రి రాకపోయే

మదనపల్లె నియోజకవర్గ టీడీపీలో నెలకొన్న పరిస్థితులను జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్దన్ రెడ్డికి చెప్పుకునేందుకు పార్టీ శ్రేణులు సిద్ధమయ్యాయి. గత నెల 13న మదనపల్లెలో మంత్రితో సమావేశం కావాలని నిర్ణయించారు. అదేరోజు హార్సిలీహిల్స్‌పై తంబళ్లపల్లె నియోజకవర్గం సమావేశం రసాభాస కావడంతో మంత్రి వెళ్లిపోయారు. ఇక్కడినుంచి మదనపల్లె పార్టీ సమావేశానికి హాజరు కావాల్సి ఉన్నా ఇక్కడ కూడా ఇదే పరిస్థితి ఉత్పన్నమవుతుందని భావించి రాకుండా కర్నూలు జిల్లా వెళ్లిపోయారు. మంత్రి వస్తారని ఎదురుచూసిన పార్టీ శ్రేణులకు నిరాశ మిగిలింది.

తంబళ్లపల్లెలో పోటాపోటీ

తంబళ్లపల్లె నియోజకవర్గంలో బి.కొత్తకోట, ములకలచెరువు వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉన్నాయి. ఈ కమిటీల చైర్మన్ పదవులపై సీనియర్ నాయకులు, పార్టీ కోసం కష్టపడిన వాళ్లు ఆశలు పెట్టుకున్నారు. అయితే వీరందరినీ కాదని స్థానిక నియోజకవర్గ నేత జయచంద్రారెడ్డి ఎవరూ ఊహించని నాయకుల పేర్లను చైర్మన్ పదవులకు సిఫార్సు చేశారని పార్టీ వర్గాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి.మొదట ములకలచెరువు మార్కెట్ చైర్మన్ పదవి ఎస్సీ మహిళకు, బి.కొత్తకోట కమిటీ చైర్మన్ పదవి బీసీ మహిళకు కేటాయించారు. తర్వాత ఏమైందో కానీ ఈ రిజర్వేషన్లు తారుమారయ్యాయి. ములకలచెరువు బీసీ, బి.కొత్తకోట ఎస్సీ మహిళకు రిజర్వ్ చేస్తూ కలెక్టర్ రెండోసారి ఉత్తర్వులు ఇచ్చారు. ఈ వ్యవహారం కూడా జయచంద్రారెడ్డి వ్యతిరేక వర్గానికి మింగుడు పడలేదు. సీనియర్లు, పార్టీకి పనిచేసిన వారికి గౌరవం ఇవ్వకపోవడం వారిలో ఆగ్రహం తెప్పిస్తోంది. దీనికి పోటీగా జయచంద్రారెడ్డి వ్యతిరేక వర్గం మార్కెట్ కమిటీ, ఇతర నామినేటెడ్ పోస్టుల భర్తీకి పేర్లు సిఫార్సు చేశారు. అధిష్టానం పదవుల భర్తీ వ్యవహారాన్ని పక్కన పెట్టినట్లు పార్టీలో చర్చించుకుంటున్నారు.

రూ.4కోట్ల ప్రభుత్వ స్థలానికి విముక్తి

- ఆక్రమణల తొలగింపునకు రంగం సిద్ధం
- గదుల నిర్మాణానికి రూ. 23 లక్షల నిధులు మంజూరు




గుర్రంకొండలోని పాత వీఎల్‌డబ్ల్యూ క్వార్టర్స్ స్థలంలో అక్రమణలు

గుర్రంకొండ: ఎన్నో దశాబ్దాలుగా కబ్జాదారుల కోరల్లో చిక్కుకొన్న ప్రభుత్వ స్థలానికి మోక్షం లభిస్తోంది. రూ. 4 కోట్లు విలువచేసే స్థలానికి కబ్జాల సంకెళ్ల నుంచి విముక్తి లభించింది. వీఎల్ డబ్ల్యూ క్వార్టర్స్ స్థలంలో వాణిజ్య సముదాయ గదుల నిర్మాణానికి రూ. 23 లక్షలు మంజూరు అయ్యాయి. కాగా మరికొంత స్థలంలో అతిథి గృహం నిర్మాణానికి అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

- గుర్రంకొండ పట్టణం నడిబొడ్డున కడప-బెంగుళూరు మార్గంలోఎన్‌హెచ్ 340 జాతీయరహదారి పక్కన పాత వీఎల్ డబ్ల్యూ క్వార్టర్స్ భవనాలు ఉన్నాయి. మండల వ్యవస్థకు ముందు పంచాయతీ సమితీలు ఉన్న కాలంలో ఇక్కడ విలేజ్ డెవలప్‌మెంట్ అధికారి నివాసం ఉండడానికి ప్రభుత్వం 1967లో సర్వే నంబర్ 117లో 3.5సెంట్ల స్థలంలో క్వార్టర్స్ నిర్మించింది. మండల వ్యవస్థ వచ్చిన తర్వాత ఈ భవనాల్లో కొద్దిరోజులు ప్రభుత్వ కార్యాలయాలు నిర్వహించారు. అనంతరం భవనం శిథిలమవడంతో ఆక్రమణలు మొదలయ్యాయి. ప్రస్తుతం ఈ స్థలం మండల పరిషత్ కార్యాలయం ఆధీనంలో ఉంది. మెల్లగా పలువురు ఈ భవనం చుట్టూ ఉన్న స్థలాలను ఆక్రమించుకొని దుకాణాలు ఏర్పాటు చేసుకోవడం ప్రారంభించారు. మార్కెట్ విలువ ప్రకారం ఈ స్థలం రూ.4 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేశారు.
- కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎంతో విలువైన ఈ ప్రభుత్వ స్థలంపై నేతల కన్నుపడింది. అధికారంలోకి వచ్చిన రోజుల వ్యవధిలోనే సదరు స్థలాన్ని ఆక్రమించి దుకాణాల ఏర్పాటు చేసుకొన్నారు. దుకాణాలు ఏర్పాటు చేసుకొనే విషయమై అధికార పార్టీ నేతలమధ్య పెద్ద ఎత్తున ఘర్షణ జరిగింది. స్థలాల ఆక్రమణల కోసం నాయకులు వర్గాలుగా విడిపోయి బహిరంగంగా ఘర్షణకు దిగారు. అప్పట్లో పోలీసులు రంగ ప్రవేశం చేయడంతో వివాదం సద్దుమణిగింది. తదనంతరం నేతల మధ్య రాజీ కుదుర్చుకొని దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. అప్పట్లో ఈ సంఘటన సంచలనం కలిగించింది.
- రెండునెలల క్రితం జెడ్పీసీఈవో గుర్రంకొండలో పర్యటించారు. మండల పరిషత్ కార్యాలయం ఆధీనంలో ఉన్న సదరు స్థలాన్ని సందర్శించి ఆక్రమణలు పరిశీలించారు. ఎన్‌హెచ్ 340 జాతీయ రహదారి పక్కనే ఉండడంతో పాటు పట్టణం నడిబొడ్డున ఉన్నందున ఈ స్థలాన్ని సక్రమంగా వినియోగించుకొంటే మండలానికి ఆదాయం సమకూరుతుందని భావించారు. వ్యాపార సముదాయం కింద గదుల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించాలని ఆదేశించారు. ప్రతిపాదనలు పంపిన వెంటనే జిల్లా పరిషత్ అధికారులు ప్రస్తుతానికి రెండు గదులు నిర్మించడానికి రూ. 23.50 లక్షలు మంజూరు చేశారు. అంతే కాకుండా ఇక్కడి స్థలంలో ఉన్న ఆక్రమణలను తొలగించడానికి అధికారులు సన్నాహాలు చేపడుతున్నారు. పదిరోజుల్లో టెండర్ల ప్రక్రియ నిర్వహించనున్నారు. ఆప్పటిలోగా ఆక్రమణలు తొలగించనున్నారు. దీంతో దశాబ్దాలుగా ఈస్థలానికి పట్టిన రాజకీయ గ్రహణం వీడనుందని గ్రామస్తులు చర్చించుకొంటున్నారు.

గదుల నిర్మాణాం చేపడతాం



పాత వీఎల్‌డబ్ల్యూ క్వార్టర్స్ శిథిలమైన స్థలం మండలపరిషత్ ఆధీనంలో ఉంది. ఇక్కడ రెండు గదులను నిర్మించడానికి జెడ్పీసీఈవో రూ.23.50 లక్షలు మంజూరు చేశారు. పదిరోజుల్లో టెండర్ల ప్రక్రియ జరుగుతంది. అప్పటిలోగా సదరు స్థలాల్లో ఉన్న ఆక్రమణలను పూర్తిగా తొలగిస్తాం.

– వెంకటేశులు, ఎంపీడీవో, గుర్రంకొండ

క్లుప్తంగా

పదో తరగతి విద్యార్థిని అదృశ్యం

గుర్రంకొండ : పదో తరగతి విద్యార్థిని అదృశ్యమైన సంఘటన మండలంలోని మర్రిమాకులపల్లెలో జరిగింది. గ్రామానికి చెందిన వెంకటేశ్, సుమలతల కుమార్తె వర్షిత(16) స్థానిక తెలుగు జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదివింది. పది పరీక్ష ఫెయిల్ కావడంతో గుర్రంకొండ తెలుగు జెడ్పీ హైస్కూల్‌లో గురువారం సప్లిమెంటరీ పరీక్ష రాసేందుకు వచ్చింది. రాసిన అనంతరం ఇంటికి చేరుకోకపోవడంతో తల్లిదండ్రులు గుర్రంకొండకు చేరుకొని వాకబు చేశారు. రెండు రోజులుగా విద్యార్థిని ఆచూకీ కోసం గాలించినా కనపడకపోవడంతో ఆమె తల్లిదండ్రులు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రఘురామ్ తెలిపారు.

370 లీటర్ల సారా ఊట ధ్వంసం



అరెస్టు చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

మదనపల్లె రూరల్ : బి.కొత్తకోట మండలంలో దాడులు జరిపి 370 లీటర్ల సారా ఊట ధ్వంసం చేసినట్లు సీఐ భీమలింగ తెలిపారు. విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడుతూ బి.కొత్తకోట మండలం సుబ్బిరెడ్డిగారిపల్లెలో ఎక్సైజ్ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారని తెలిపారు. జి.కృష్ణప్ప కుమారుడు జి.రవికుమార్(30), టి.సుబ్బయ్య కుమారుడు టి.ఆనంద్(34), అదే గ్రామానికి చెందిన కె.వెంకటరమణ(70)లు సారా విక్రయిస్తుండగా అరెస్టు చేశామన్నారు. వారి వద్ద పది లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దీంతోపాటు తయారీకి సిద్ధంగా ఉంచిన 370 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేశామన్నారు. ముగ్గురు వ్యక్తులపై వేర్వేరుగా కేసులు నమోదుచేసి రిమాండ్‌కు పంపామన్నారు ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.

రాజంపేటలో..
తమ్ముళ్ల రాద్ధాంతం



రాజంపేట తమ్ముళ్లలో ఇన్‌చార్జి గోల మళ్లీ మొదలైంది. శుక్రవారం టీడీపీ నేత చమర్తి జగన్‌మోహన్‌రాజు రాజంపేట టీడీపీ ఇన్‌ఛార్జి అంటూ సోషల్ మీడియా, మీడియా గ్రూపులలో ప్రచారం జరిగింది. దీంతో నియోజకవర్గ టీడీపీ క్యాడర్‌లో విభేదాలు భగ్గుమన్నాయి.

- ఎటూ తేలని రాజంపేట టీడీపీ ఇన్‌ఛార్జి నియామకం
- తాత్కాలిక ఇన్‌ఛార్జిగా చమర్తి ఉంటారని ప్రకటన
- రగిలిపోయిన ప్రత్యర్థి వర్గ టీడీపీ నాయకులు
- మహానాడుకు జన తరలింపు ప్రశ్నార్థకం

రాజంపేట : రాజంపేట ఇన్‌చార్జి నియామకంపై సామాజిక మాధ్యమాల్లో పెద్ద ఎత్తున చర్చమొదలైంది. శుక్రవారం వ్యూహాత్మకంగా చమర్తిని ఇన్‌చార్జిగా నియమించారంటూ పార్టీ క్యాడర్‌కు సామాజిక మాధ్యమాల ద్వారా తెలిపారు. దీంతో ఆ పార్టీ క్యాడర్‌లో కొంతత గందరగోళం మొదలైంది. కడప మినీ మహానాడు నేపథ్యంలో రాజంపేటలో గురువారం జరిగిన సభలో పరిశీలకుడు దుర్గాప్రసాద్ తాత్కాలిక సమన్వయకర్తగా చమర్తి జగన్‌మోహన్ రాజు పనిచేస్తారని తెలిపారు. దానిని చమర్తి వర్గీయులు రాజంపేట టీడీపీ ఇన్‌ఛార్జి అంటూ తమ క్యాడర్‌లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. దీంతో వైరివర్గ నేతలు ఇన్‌ఛార్జిగా చమర్తిని ఎలా నియమిస్తారంటూ రగిలిపోయారు. దీంతో రాజంపేట టీడీపీలో ఇన్‌చార్జి నియామకం వ్యవహారం దుమారం లేపింది. ఇన్‌చార్జిగా ఇప్పటికీ ఎవరినీ నియమించలేదంటూ అదే పార్టీలోని వైరీవర్గ నేతలు సోషల్ మీడియా గ్రూపులు వేదికగా విమర్శలు చేయడం ప్రారంభించారు. దీంతో విభేదాలు మరోసారి బయటపడ్డాయి. ఇన్‌చార్జిగా అధిష్టానం ఎవరినీ ఇంతవరకు నియమించలేదని కొందరు మాటల తుటాలు పేల్చుకున్నారు. చమర్తి ఇన్‌చార్జి అనగానే ఆయన సామాజికవర్గంలో సంతోషం వ్యక్తం కాగా, గత ఎన్నికలో పోటీ చేసిన ఓడిపోయిన సుగవాసిని కాదని చమర్తికి ఏవిధంగా ఇన్‌చార్జి ఇస్తారంటూ కొందరు పెదవి విరుస్తున్నారు. సుగవాసి సైలంట్‌గా ఉన్న నేపథ్యంలో ఇన్‌చార్జి వ్యవహారంపై టీడీపీ అధిష్టానం కొలిక్కి తీసుకురాలేని పరిస్థితి పోతోంది.

మహానాడు జనం తరలింపు నేత ఎవరు..

టీడీపీలో వర్గ విభేదాలు పొడచూపడంతో కడపలో మహానాడుకు జనం తరలింపు ప్రశ్నార్థకరంగా మారింది. పార్టీకి పెద్దదిక్కు ఎవరో తెలియని సంకటస్థితి నెలకొంది. పార్టీ క్యాడర్‌ను మహానాడుకు మళ్లించాలంటే లక్షల రూపాయిల వ్యయం అవుతుంది. విభేదాల నేపథ్యంలో ఎవరూ ముందుకురాలేదని, చమర్తి జగన్‌మోహన్‌రాజుకు తాత్కాలిక సమన్వయ కర్త బాధ్యతలు అప్పగించడమే ఇందుకు కారణమనే చర్చ మొదలైంది. సీనియారిటీకే ప్రాధాన్యం ఇవ్వాలని పలువురు నేతలు నిరసన గళం విప్పారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన క్యాడర్‌ను కాదని, కొత్త వారికి చోటు ఇచ్చే అంశాన్ని ప్రధానంగా ప్రస్తావించినట్లు తెలుస్తోంది. ఐదేళ్లలో దర్జాగా అధికారం అనుభవించిన నేతలు, ప్రజాప్రతినిధులు టీడీపీలో చేరిన నేపథ్యంలో మినీ మహానాడు వేదికగా సీనియర్లు చేసిన వ్యాఖ్యలు దుమారం లేపాయి. ఈ వ్యాఖ్యలు కొత్త నేతలకు మింగుడుపడటం లేదు.

గుడ్డి కన్నా మెల్ల మేలు



మాట్లాడుతున్న కొమర వెంకటనరసయ్య

ఒంటిమిట్ట : టీడీపీ రాజంపేట తాత్కాలిక సమన్వయకర్తగా చమర్తి జగన్‌మోహన్‌రాజును ప్రకటించడంపై టీడీపీ ఒంటిమిట్ట సీనియర్ నాయకుడు కొమర వెంకటనరసయ్య చేసిన వ్యాఖ్యలు వివాదం రేపాయి. స్థానిక హరిత హోటల్‌లో విలేకరులతో టీడీపీ సీనియర్ నాయకుడు కొమర వెంకటనరసయ్య మాట్లాడుతూచమర్తి నియామకంపై గుడ్డి కన్నా మెల్ల మేలు అంటూ అతడు విలేకరుల సమావేశంలో వ్యంగాస్త్రం విసిరారు. తాత్కాలిక సమన్వయకర్తగా దమ్మున్న నాయకుడిని నియమించి ఉంటే బాగుండేదని మాట్లాడారు.

మహిళకు తీవ్రగాయాలు



గాయపడిన మహిళ

మదనపల్లె రూరల్ : గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళ గాయపడిన సంఘటన శుక్రవారం మండలంలో జరిగింది. గుర్తుతెలియని మహిళ(60) బసినికొండ, కొండామర్రిపల్లెలో భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తోంది. ఎప్పటిలాగే భిక్షాటనకు వెళుతుండగా.. కొండామర్రిపల్లె రోడ్డు సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ప్రమాదంలో ఆమె తీవ్రంగా గాయపడగా, స్థానికులు బసినికొండ మహిళా పోలీస్‌కు సమాచారం అందించారు. స్థానికుల సహాయంతో మహిళా పోలీస్ బాధితురాలిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

గుండంలో పడి అఘోరి మృతి



మృతి చెందిన అఘోరి

చిట్వేలి : నగిరిపాడు పంచాయతీ పెద్దూరు అటవీ ప్రాంతంలోని గుండాల కోన గుండంలో పడి అఘోరి మృతిచెందింది. శివరాత్రి సందర్భంగా ఆమె గుండాల కోనను సందర్శించి..ఐదురోజుల తర్వాత తిరిగి వెళ్లినట్లు సమాచారం. మళ్లీ గురువారం గుండాలకోనకు వచ్చి నిర్మానుష్యమైన ప్రాంతానికి వెళ్లినట్లు భక్తులు తెలిపారు. అనంతరం శుక్రవారం గుండంలో శవమై తేలింది. అటవీ సమీప గ్రామాల ప్రజలు ఈ విషయం స్థానిక పోలీసులకు తెలియజేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృత దేహాన్ని వెలికితీయించారు. అఘోరికి సంబంధించి ఎలాంటి సమాచారం లేకపోవడంతో మృతదేహాన్ని కోడూరు మార్చురీలో ఉంచినట్లు తెలిపారు. అఘోరికి సంబంధించిన వారు ఎవరైనా ఉంటే చిట్వేలి స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరుతున్నారు. పూర్తి వివరాలకు ఎస్ఐ 9121100579, సిఐ 9121100576 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఇనుప కంచె ఏర్పాటు

– కదిలిన ఎన్‌హెచ్ఏఐ అధికారులు

సాక్షి ఎఫెక్ట్..



ఇనుక కంచె ఏర్పాటు చేస్తున్న ఎన్‌హెచ్ఏఐ సిబ్బంది

రాజంపేట : కంచెపోయె..కటవ వచ్చె శీర్షికన శుక్రవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన ఫొటో చిత్ర వార్తకు నేషనల్ హైవే ఆఫ్ అథారిటీ తిరుపతి అధికారులు స్పందించారు. రైతులు ఇనుప కంచె లేకపోవడంతో కంపతో కటవ వేసుకున్న దృశ్యాలను ఎన్‌హెచ్ఏఐ అధికారుల దృష్టికి వెళ్లింది. హుటాహుటిన సిబ్బంది చెయ్యేరు వంతెన వద్ద (నందలూరువైపు) ఇనుప కంచెను ఏర్పాటు చేశారు. ఆ ప్రాంత రైతులు, వాహనదారులు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

డేంజర్ జోన్‌లో క్వారీకి ఎలా అనుమతిస్తారు ?

పంటలు నష్టపోతున్నామని గోవిందంపల్లి గ్రామస్థులు ఆగ్రహం



క్వారీని పరిశీలిస్తున్న ఏడీ సుబ్రహ్మణ్యం, సిబ్బంది

ఓబులవారిపల్లె : డేంజర్ జోన్‌గా ప్రకటించినప్పటికీ.. ఏపీఎండీసీ మంగంపేట గనికి 500 మీటర్ల దూరంలో కంకర క్వారీకి ఎలా అనుమతిస్తారని గోవిందంపల్లి గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలుష్యం కారణంగా తమ పంటలు నష్టపోతున్నామని మైన్స్ అధికారులకు రైతులు ఫిర్యాదు చేయడంతో అన్నమయ్య జిల్లా మైన్స్ ఏడీఎం సుబ్రహ్మణ్యం సిబ్బందితో కలిసి శుక్రవారం క్వారీ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు వారితో మాట్లాడుతూ కంకర క్వారీలో నిర్వహించే భారీ పేలుళ్ల కారణంగా వాహనదారులు ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. కాలుష్యంతో పంటలకు నష్టం వాటిల్లుతోందని, శ్వాసకోశ, కిడ్నీ, క్యాన్సర్ వ్యాధుల బారిన పడి చాలామంది మృతి చెందారని ఆరోపించారు. తమ ఆస్తులు అమ్ముకున్నా ఆసుపత్రులకు సరిపోదని వారు వాపోయారు. గోవిందంపల్లి ప్రజలను కాపాడాలని, చర్యలు తీసుకోకపోతే విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఏడీ సుబ్రమణ్యం కంకర క్వారీ క్రషర్లను పరిశీలించి మాట్లాడుతూ పూర్తిస్థాయిలో నివేదిక సిద్ధం చేసి ఉన్నతాధికారులకు తెలియజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రామసుబ్రహ్మణ్యం, సింగ్, గోపీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ పరీక్షలో మాస్ కాపీయింగ్

– కుప్పలు తెప్పలుగా చిట్టీలు



జెడ్పీ హైస్కూల్ ప్రాంగణలో పడేసిన చిట్టీలు

మదనపల్లె రూరల్ : ఓపెన్ టెన్త్ పరీక్షల్లో యథేచ్ఛగా మాస్ కాపీయింగ్ జరిగింది. పట్టణంలోని జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన పదో తరగతి ఓపెన్ సప్లిమెంటరీ గణితం పరీక్షలో మాస్ కాపీయింగ్ చేయించినట్లు తెలిసింది. విద్యార్థులు చిట్టీలు తీసుకుని వెళ్లి పరీక్ష రాసి, వాటిని పాఠశాల ప్రాంగణంలోనే పడేసి వెళుతున్నారు. ఎక్కడ చూసినా కుప్పలు తెప్పలుగా చిట్టీలు దర్శనమిస్తున్నాయి. డీవైఈఓ లోకేశ్వరరెడ్డి వివరణ కోరగా...తాను పీలేరులో ఉన్నానని, రేపు సెంటర్‌ను తనిఖీ చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

తీగలు తగిలి గేదె మృతి



విద్యుద్ఘాతానికి గురై చనిపోయిన గేదే

సింహాద్రిపురం : మండలంలోని అహోబిలం గ్రామానికి చెందిన గంగిరెడ్డికి చెందిన గేదె విద్యుత్తు షాక్‌కు గురై మృతిచెందింది. గ్రామానికి చెందిన గంగిరెడ్డి, నాగేశ్వరరెడ్డి, రాజారెడ్డి, రవీంద్రనాథరెడ్డి తమ గేదెలను సమీపాన ఉన్న చెరువు గట్టున మేపుకొనేందుకు తీసుకెళ్లారు. గంగిరెడ్డికి చెందిన గేదె అక్కడే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తీగలకు తగలడంతో షాక్‌కు గురై మృతి చెందింది. రూ.92వేలు నష్టపోయానని బాధిత రైతు గంగిరెడ్డి తెలిపారు.

పోలీస్ బైక్ దొరికింది

ప్రొద్దుటూరు క్రైం : కర్నాటక వాసి ఎత్తుకెళ్లిన బ్లూకోల్ట్స్ బైక్ దొరకడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. పట్టణంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న కర్నాటక రాష్ట్రానికి చెందిన వ్యక్తిని బుధవారం రాత్రి రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. అతడిని విచారించగా మతిస్థిమితం లేని వ్యక్తిగా నిర్ధారణ అయింది. ఉదయం ఇంటికి పంపాలని పోలీసులు అతన్ని స్టేషన్‌లోనే పెట్టుకున్నారు. ఈ క్రమంలో గురువారం వేకువజామున స్టేషన్‌లో నుంచి బ్లూకోల్ట్స్ బైక్‌తో పరారైన విషయం పాఠకులకు విదితమే. అయితే పట్టణ శివారు ప్రాంతంలో పడేసి వెళ్లిన బ్లూకోల్ట్స్ బైక్‌ను గురువారం ఉదయం రూరల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కర్నాటకు వాసిని కూడా అదుపులోకి తీసుకొని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

హత్య కేసులో ముగ్గురి అరెస్టు

జమ్మలమడుగు రూరల్ : ఇంటి ముంగిట పేడ నీళ్ల చల్లుకునే విషయంలో జరిగిన ఘర్షణకేసులో శుక్రవారం ముగ్గురిని అరెస్టు చేసినట్లు సీఐ లింగప్ప తెలిపారు. ఈ నెల 10న మండలంలోని పి.బొమ్మేపల్లిలో పేడనీళ్లు చెల్లుకునే విషయంలో ఇరు వర్గాలు ఘర్షణకు దిగాయి. పరస్పరం దాడులు చేసుకోవడంతో గాయాల పాలైన రాజ చొడప్ప మృతి చెందాడు. ఈ హత్య కేసులో ఇది వరకే నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం బొగ్గు నడిపి సుబ్బరాయుడు, అతడి కుమారుడు నడిపి సుబ్బరాయుడు, నాగంజి అనులను ఆదివారం అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

హత్య కేసులో నిందితుడు..

జమ్మలమడుగు రూరల్ : మండలం లోని ముద్దనూరు రహదారిలో ఈ నెల 18న హత్యకు గురైన చెన్నంశెట్టి మల్లికార్జున (32) కేసులో నిందితుడిని అరెస్టు చేశారు. సీఐ లింగప్ప వివరాల మేరకు.. చెన్నంశెట్టి మల్లికార్జున, అతడి భార్య సరోజ మధ్య మనస్పర్థలు రావడంతో దూరంగా ఉంటున్నారు. అంత కంటే ముందుగా సరోజతో గొడవపడిన భర్త చెన్నంశెట్టి మల్లికార్జున తన ఇంటి నుంచి గెంటివేశాడు. దీనిని దృష్టిలో పెట్టుకున్న సరోజ సోదరుడు వినోద్‌కుమార్ మల్లికార్జునపై ఆగ్రహంతో ఉన్నాడు. ఈ నెల 18న బావ చెన్నంశెట్టి మల్లికార్జున జమ్మలమడుగుకు రావడంతో కొత్తరోడ్డు సమీపంలో వినోద్ తన కత్తితో దాడి చేసి హత్య చేసినట్లు సీఐ తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు.

చర్చకు సిద్ధమని చెప్పినా కాల్చేయడం దారుణం

కడప ఎడ్యుకేషన్ : మావోయిస్టులు శాంతి చర్చలు కోరుతున్నా.. ఆపరేషన్ కగార్ పేరిట చత్తీస్‌ఘడ్, బస్తర్ అడవుల్లో మారణకాండ సాగించడం దారుణమని ఆర్‌ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డీఎం.ఓబులేసుయాదవ్ పేర్కొన్నారు. కడప విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఎన్‌కౌంటర్ పేరుతో సీపీఐ(ఎంఎల్) మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి సంబాల కేశవరావు, మరింతమంది మావోయిస్టులు, ఆదివాసీలను కాల్చి చంపడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. చట్ట విరుద్ధంగా సాగిన హత్యాకాండపై న్యాయ విచారణ చేయాలని కోరారు. శ్రీకాకుళం జిల్లా పలాసలో ప్రజా సంఘాల నిరసన ప్రయత్నాన్ని భగ్నం చేసి, పోలీసులు హడావుడి చేస్తున్నారని, ప్రజల హక్కులపై ఆంక్షలు విధించవద్దని విజ్ఞప్తి చేశారు.

యువకుడిపై కత్తితో దాడి

కలసపాడు : బాకీ చెల్లించే విషయంలో జరిగిన ఘర్షణలో ఒకరిపై కత్తితో దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని ఎగువరామాపురం గ్రామానికి చెందిన తవ్వా శివరామక్రిష్టారెడ్డి అదే గ్రామానికి చెందిన అంకిరెడ్డికి డబ్బు బాకీపడ్డాడు. ఈ విషయమై వారిద్దరి మధ్య కొంత కాలంగా వివాదం జరుగుతోంది. గురువారం రాత్రి ఈ విషయంపై మాట్లాడేందుకు శివరామక్రిష్టారెడ్డి ఇంటి వద్దకు వెళ్లిన అంకిరెడ్డి ఆయన తల్లి నారాయణమ్మ, తదితరులను అసభ్య పదజాలంతో దూషించాడు.

ఈ విషయం తెలుసుకుని ఆగ్రహానికి గురైన శివరామక్రిష్టారెడ్డి, తన తల్లిని తీసుకుని అంకిరెడ్డి ఇంటికి వెళ్లి నిలదీశారు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. అప్పటికే మద్యం మత్తులో ఉన్న అంకిరెడ్డి కత్తితో శివరామక్రిష్టారెడ్డిపై దాడి చేయడంతో గాయాలయ్యాయి. స్థానికులు తిరుపతి ఆస్పత్రికి తరలించారు. బాధితుడు శివరామక్రిష్టారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అంకిరెడ్డిని అరెస్టు చేశారు.

పిచ్చికుక్క దాడిలో ఒకరికి గాయాలు

పులివెందుల రూరల్ : పట్టణంలోని ముద్దనూరు రోడ్డులోని బస్టాండు సమీపంలో పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. గత మూడు రోజులుగా ప్రయాణికులపై దాడి చేస్తూ ఆందోళనకు గురి చేస్తోంది. శుక్రవారం కొత్త బస్టాండ్‌లో స్వీపర్‌గా పనిచేస్తున్న ప్రశాంతిపై పిచ్చి కుక్క దాడి చేయడంతో గాయాలయ్యాయి. అంతటితో ఊరుకోకుండా ప్రయాణికులపైకి దూసుకెళ్లి అరవడంతో భయపడిపోయారు. అధికారులకు ఈ విషయం చెప్పినా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారేగానీ చర్యలు తీసుకోవడంలేదు. కుక్కను పట్టి తరలించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

విధులకు ఆటంకపరిచిన వ్యక్తిపై కేసు

రాజంపేట : స్థానిక తహసీల్దారు కార్యాలయం సిబ్బంది పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన రాజంపేట మండల పులపత్తూరుకు చెందిన వెంకటయ్యపై కేసు నమోదు చేసినట్లు పట్టణ స్టేషన్ హౌస్ ఆఫీసర్ శుక్రవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. తహసీల్దారు చాంబరులో ఉండగా వెంకటయ్య అనుమతి లేకుండా లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారన్నారు. చాంబరులోకి వెళ్లి సిబ్బంది అసభ్యకరంగా మాట్లాడారన్నారు. తహసీల్దారును తన ఇసుక అనుమతి గురించి తన ఫైలు చూడకుండా పక్కనపెట్టారని, తనకు తానే ఊహించుకొని ఆఫీసు సిబ్బంది విధులను ఆటంకపరిచారన్నారు. తహసీల్దారు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. ప్రజల సమస్య ఏదైనా ఉంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులను దూషించడం, వారిపై దాడికి దిగడం చట్టరీత్యా నేరమని వెల్లడించారు.

పెట్రోల్ పోసుకుని వివాహిత ఆత్మహత్యాయత్నం



పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించిన వివాహిత రాణి

మదనపల్లె రూరల్ : కుటుంబ సమస్యలు, రెండో భర్త వేధింపులు తాళలేక ఓ వివాహిత పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు.. కర్నాటక రాష్ట్రం చింతామణికి చెందిన రాణి(30) భర్తతో అభిప్రాయభేదాల కారణంగా విడాకులు తీసుకుంది. ఆమెకు కుమారుడు సుమిత్(12), కుమార్తె లేఖన(6) ఉన్నారు. మూడేళ్ల కిందట సత్యసాయిజిల్లా పాలసముద్రం మండలం బోయలపల్లెకు చెందిన డ్రైవర్ అశోక్‌తో బెంగళూరులో సహజీవనం చేస్తోంది. కాగా, అశోక్‌కు ఇటీవల అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లెకు చెందిన మౌనీషాతో వివాహమైంది. ఆమె ప్రస్తుతం గర్భిణీ కావడంతో పుట్టింట్లో ఉంది. కొద్ది రోజుల కిందట అశోక్‌కు కాలు విరగడంతో రాణి సాయంతో చికిత్స తీసుకుని స్వగ్రామానికి చేరుకున్నాడు. కుటుంబ సభ్యుల సూచనతో రాణి బెంగళూరులో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో రాణికి ఫోన్ చేసిన అశోక్.. నన్ను వదిలి వెళ్లిపోతావా అంటూ గొడవ పడ్డాడు. దీంతో కుమార్తెతో కలిసి రాణి అశోక్‌ను కలుసుకునేందుకు రాగా ఇద్దరి మధ్య వాగ్వివాదం జరిగింది. ఆగ్రహంతో రాణిపై అశోక్ చేయి చేసుకోవడంతో మనస్తాపం చెందింది. ఆర్టీసీ బస్టాండ్ వెనుక ఉన్న కోమటివానిచెరువు కట్ట సమీపంలోని రోడ్డుపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుంది. బాధితురాలిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, ఏఎస్ఐ రమణ ఆమె నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. అశోక్‌ను తాను రెండో వివాహం చేసుకున్నానని, తనపై అనుమానంతో నిత్యం వేధిస్తున్నాడని తెలిపింది. చికిత్స అనంతరం ఆమె పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. టూటౌన్ పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

ఇద్దరు బైక్ దొంగల అరెస్టు

మైదుకూరు : బైక్‌ల చోరీపై పోలీసులు చేపట్టిన నిఘాతో ఏకంగా ఇద్దరు అంతర్ జిల్లాల బైక్ దొంగలు శుక్రవారం మైదుకూరు అర్బన్ పోలీసులు పట్టుబడ్డారు. వైఎస్సార్, నంద్యాల, అనంతపురం, అన్నమయ్య జిల్లాల్లో చోరీ చేసిన ఎనిమిది బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. అర్బన్ సీఐ కేవీ.రమణారెడ్డి వివరాల మేరకు.. ఎర్రగుంట్ల మండలం పోట్లదుర్తి గ్రామానికి చెందిన కొప్పోలి జాయ్, ప్రొద్దుటూరు మండలం నంగనూరుపల్లె గ్రామానికి చెందిన చాపాటి పవన్, మరో ముగ్గురు మైనర్లతో కలిసి చోరీలకు అలవాటు పడ్డారు. మైదుకూరు, అన్నమయ్య జిల్లా రాయచోటి, అనంతపురం జిల్లా తాడిపత్రి, నంద్యాల జిల్లా చాగలమర్రి, సిరివెళ్ల, కొలిమిగుండ్ల పోలీస్ స్టేషన్ల పరిధిలో ఇంటి ఎదుట పార్కు చేసిన బైక్‌లను ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు నిఘా పెట్టిన పోలీసులు మైదుకూరు- ప్రొద్దుటూరు బైపాస్ రోడ్డులోని వంతెన వద్ద ఇద్దరినీ అరెస్టు చేశారు. మరో ముగ్గురు మైనర్లు పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు. రూ.10 లక్షల విలువలైన 8 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పట్టుకునేందుకు కృషి చేసిన అర్బన్ ఎస్ఐ సుబ్బారావు, సిబ్బంది భాస్కర్‌రెడ్డి, వెంకటకిరణ్, ప్రసాద్ రాజు, శివగణేష్, నవీన్, తిరుమలయ్య, ప్రసాద్‌లను డీఎస్పీ రాజేంద్ర ప్రసాద్ అభినందించారని సీఐ పేర్కొన్నారు. వారికి రివార్డులు అందజేస్తామన్నారు. బైక్‌లను పార్కు చేసే సమయంలో సైడ్ లాక్ తప్పనిసరిగా చేయాలని సూచించారు. ఊర్లకు వెళ్లే సమయంలో పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ సమావేశంలో అర్బన్ ఎస్ఐ సుబ్బారావు, ఏఎస్ఐలు శివప్రసాద్ రెడ్డి, మురళి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపుతో ఉద్రిక్తత

- మున్సిపల్ సిబ్బందితో టీడీపీ నేత వాగ్వాదం
- కమిషనర్‌పై తీవ్ర పదజాలంతో నేత ఆగ్రహం



మున్సిపల్ సిబ్బందితో వాగ్వాదం చేస్తున్న టీడీపీ నాయకుడు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : బద్వేల్-నెల్లూరు రోడ్డులోని దుకాణాల ఎదుట ఆక్రమణల తొలగింపు శుక్రవారం ఉద్రిక్తతకు దారి తీసింది. మున్సిపాలిటీని ముండ మోపించేందుకే వచ్చాడంటూ టీడీపీ నాయకులు మున్సిపల్ కమిషనర్‌పై తీవ్ర పదజాలంతో విరుచుకుపడే పరిస్థితి తలెత్తింది. వివరాల్లోకి వెళ్తే.. బద్వేల్ పట్టణ సుందరీకరణ పనుల్లో భాగంగా మున్సిపల్ కమిషనర్ వివి.నరసింహారెడ్డి ఆదేశాల మేరకు పట్టణ ప్రణాళిక అధికారి సతీష్, సిబ్బంది నరసయ్య ఆధ్వర్యంలో రోడ్డుపై ఉన్న బోర్డులు, రేకుల షెడ్డులను తొలగించే పనులు చేపట్టారు. ఈ సమయంలో ఓ దుకాణం ఎదుట ఏర్పాటు చేసిన సిమెంటు బల్లలు తొలగించారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న టీడీపీ మున్సిపాలిటీ నాయకుడు మిత్తికాయల రమణ అక్కడికి చేరుకుని మున్సిపల్ సిబ్బందితో వాగ్వాదానికి దిగాడు. ముందస్తు నోటీసులు ఇవ్వకుండా ఎలా తొలగిస్తారంటూ ఆగ్రహంతో ఊగిపోయాడు. సచివాలయ ప్లానింగ్ సెక్రటరీల ద్వారా ముందస్తు సమాచారం ఇచ్చామని పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు చెబుతున్నప్పటికీ వినిపించుకోకుండా వారిపై చిందులేశాడు. అంతటితో ఆగకుండా ఈ కమిషనర్ బద్వేల్ మున్సిపాలిటీని ముండమోపించేందుకే వచ్చాడు.. నాశనం చేసి పోతాడు అంటూ తీవ్ర పదజాలంతో విరుచుకుపడ్డాడు. మీరు మనుషులను తీసుకువచ్చి ఇలా చేయడం సరికాదని సిబ్బంది అనగా.. మనుషులను పంపిస్తే పరిస్థితి ఇలా ఉండదంటూ బెదిరింపులకు దిగారు. సిబ్బంది చేసేదిలేక ఆక్రమణల తొలగింపు నిలిపేసి వెనుదిరిగారు. జరిగిన విషయాన్ని మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకుపోవడంతో పోలీసు బందోబస్తు నడుమ ఆక్రమణలు తొలగించారు. మున్సిపల్ అధికారుల విధులకు ఆటంకం కలిగిస్తూ వారిని ఇష్టానురీతిలో మాట్లాడినప్పటికీ పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు చేయకపోవడం గమనార్హం. ప్రభుత్వ ఉద్యోగులను బెదిరించిన టీడీపీ నాయకుడిపై చర్యలు తీసుకోకపోతే ప్రభుత్వ ఉద్యోగుల మనోభావాలు, ఆత్మస్థైర్యం దెబ్బతింటుందని కొందరు ఉద్యోగులు చర్చించుకోవడం కనిపించింది.